అడల్ట్స్ ఓన్లీ కధ

# కుందనపు బొమ్మ

''గుడ్‌మార్నింగ్. కుందూ డియర్'' తలుపు తీసిన కుందనను విష్ చేశాడు కమల్.

''సేమ్ టు యు శ్రీవారూ... అయినా 'కుందన' అని మా అమ్మ-నాన్న పెట్టిన చక్కటి పేరుండగా ఈ 'కుందూ, సందూ' ఏంటండీ'' అంది కుందన నవ్వుతూనే.

''నిన్ను పూర్తి పేరు పెట్టి పిలిస్తే పరాయివాళ్లకి నాకు తేడా ఏముంటుంది? నా 'కుందు'ను నా ఇష్టమొచ్చినట్లుగా పిలుచుకునే హక్కు నాకుంది. కాదనేదెవరు?'' అన్నాడు కమల్ లోపలికి వస్తూ.

అతడి చేతిలోంచి బ్రీఫ్‌కేస్ అందుకుంటూ ''మరే... కుందూ అని కాకపోతే 'బిందె' అని పిలుచుకోండి. వద్దనేదెవరు?'' అంది కుందన పెదవులు విప్పార్చి హాయిగా నవ్వుతూ.

పలుచని గులాబీరేకుల్లాంగా పగడపు పెదవుల నలంకరించిన పారిజాతపు రెక్కలాంటి స్వచ్ఛమైన ఆ దరహాసానికి ముగ్ధుడైపోయాడు కమల్.

ఒక్క ఉదుటున చేయి చాచి కుందనని సందిట బంధించాడు.

ఎంతో ఇష్టంగా అతడి బాహుబంధంలో ఒదిగిపోతూనే ''ఇలా గడపలో కాలు పెట్టారో లేదో.. అప్పుడే షురూ అయ్యాయా దొరగారి సరాగాలు'' అంది కుందన చిరుకోపం నటిస్తూ.

''మొదలుపెట్టక చేతులు కట్టుకు కూర్చోమన్నావా! అసలే వారం రోజుల విరహం.. మనకి పెళ్లయ్యి ఇంకా నాలుగు నెలలే అయ్యింది'' కినుకగా అన్నాడు కమల్ తాము నవదంపతుల మన్న సంగతి గుర్తు చేస్తూ.

కుందన ఓరకంటి చూపు కమల్‌లో మదన తాపాన్ని రేకెత్తించింది.

''నాకూ ఆ సామెతను నిజం చేయాలనే ఉంది. కానీ నా ఉద్యోగం అందుకు ఆస్కారమీయడం లేదు. నాగ్గాని కోపం వస్తే లాంగ్‌లీవ్ పెట్టి ఇంట్లో కూర్చుంటాను'' అన్నాడు కుందనను తినేసేలా చూస్తూ.

అతడి ఉక్రోషానికి మనసారా నవ్వుకుంటూ ''ఆ పని మాత్రం చేయకండి మహానుభావా! అయినా ఇలా కౌగిట్లో కబుర్లతో కాలం గడిపేస్తే ఎలా? వెళ్లి స్నానం చేసి రండి. వేడిగా దోసెలు పోస్తాను'' అంది సున్నితంగా అతడి చేతుల్లోంచి విడిపించుకుంటూ.

''పోశాక?''

''ఏముంది? తినడమే'' అంది కుందన.

''తిన్నాక?'' రెట్టించాడు కమల్.

''తిన్నాక నేను తిన్నగా కిచెన్‌లోకి వెళ్లి 'వంట పని' చేసుకోవడం, మీరు కామ్‌గా రెస్ట్ తీసుకోవడం'' అతడి మాటల్లో శ్లేష అర్థం అయినా అవనట్లుగా బదులిచ్చింది కుందన కవ్వింపుగా.

ఆమెకు బాగా తెలుసు. ఆరోజుకి ఒంటిపనే తప్ప వంట పని శూన్యం అని. విశ్రాంతి తీసుకోవడమంటే కమల్ పరిభాషలో అర్థమే వేరు.

''అన్నీ తెలిసినా తెలియనట్లుగా నటిస్తావేం ఇందువదనా'' మత్తు చూపులు రువ్వాడు కమల్.

ఈసారి కుందన అందంగా సిగ్గుపడింది. విసనకర్రల్లాంటి కనురెప్పలను వీవనలు విసిరినట్లుగా అల్లల్లార్చి ''మహాప్రభో.. మీతో వేగలేను.. తమరు స్నానా



కె.కె. భాగ్యశ్రీ

నికి దయచేయండి'' అంటూ వెనక నుండి అతని భుజాలు పట్టి తోసూ బాత్‌రూమ్‌లోకి నెట్టింది.

''నువ్వూ రాకూడదూ..సరిగంగ స్నానాలు చేద్దాం'' ఆశగా అడిగాడు కమల్.

''అవన్నీ తరువాత..ముందు ఆత్మారాముడిని సంతృప్తిపరుచుదాం'' నిక్కచ్చిగా చెప్పింది కుందన.

ఆ మాటలకి బుద్ధిమంతుడిలా తలూపి బాత్‌రూమ్‌కి వెళ్లాడు కమల్.

అతడి కొంటెతనానికి నవ్వుకుంటూ పొయ్యి మీద పెనం కాలేసింది కుందన.

అతడు స్నానం చేసి వచ్చేలోపు చట్నీ రుబ్బేసి దోశెలు పోసింది.

తల తుడుచుకుంటూ వచ్చిన కమల్‌కి డైనింగ్ టేబుల్ దగ్గర అన్నీ సిద్ధం చేస్తున్న కుందన కనిపించింది.

దీక్షగా పనిచేయడం వలనో ఏమో, ఎర్రటి పెదవుల బిగింపులో ఏర్పడిన నిండుసున్న గులాబీ మొగ్గలా ఎంతో ముద్దుగా కనిపించింది.

లేత మబ్బురంగు షిఫాన్ చీరలోంచి కనిపించీ కనిపించక ఊరిస్తున్న నడుం ముడత ప్రొవోకింగ్‌గా ఉంది. ఇంకా కిందికి దిగాయి అతడి చూపులు.

## ప్చ్ భూమిక!!

**ప్రస్తుతం తెలుగులో 'అనసూయ', 'స్వాగతం' చిత్రాల్లో నటిస్తున్న భూమిక తనకి పెళ్లయిపోయిందని సినిమాలకు గుడ్‌బై చెప్పేస్తున్నానని ఎవరూ భావించనవసరం లేదని సెలవిస్తోంది. హీరోయిన్ పాత్రలకి తను ఇంకా రెడీయేనట. కానీ పెళ్లయిన హీరోయిన్‌ల పట్ల ప్రేక్షకుల్లోనూ, ఇండస్ట్రీలోనూ వున్న ఓ రకమైన ఫీలింగ్- భూమికకి హీరోయిన్ వేషాలిప్పిస్తుందా అనేదే డౌటు!**

ఉరకలెత్తి ప్రవహించే వరదనీటి ఉధృతికి ఒరుసుకుపోయిన ఇసుక తిన్నెలా, ఒంపు తిరిగిన జఘన భాగం రారమ్మంటూ రెచ్చగొడుతోంది.

''కుందూ..మై లవ్లీ డార్లింగ్'' ఆగలేనట్లుగా వెనుక నుండి వెళ్లి ఆమెను వాటేసుకొని ఆమె మెడవంపులో ముఖాన్ని ఆన్చి, మెత్తటి కురులతో ముఖం రుద్దుకున్నాడు.

కుంకుడు కాయల పరిమళం గుప్పుమంది ఆమె అలకలలో.

''ప్లీజ్ కాస్తాగండి.. టిఫిన్ తినేసి మీ ఇష్టం'' లాలనగా చెప్పింది. కుందన అతడి స్పర్శలోని అనుభూతిని ఆస్వాదిస్తూనే.

''నాకు..'నిన్ను' తినాలని ఉంది'' తమకంగా ఆమె నడుమును తడుముతూ అన్నాడు కమల్.

ఆపినా అతడాగే పరిస్థితిలో లేడని కుందనకి అర్థమైంది.

ఇద్దరూ బెడ్‌రూమ్‌లో చేరారు.

''ఇందువదన, కుందరదన, మందగమన, మధురవచన గగన జఘన సొగసులలనవే..'' అంటూ రాగయుక్తంగా పాడాడు కమల్ ఆమె కటిసీమను కాంక్షగా తడుముతూ.



కుందన మరింతగా అతడిని హత్తుకుంది. బయట ఎండ మండిపోతున్నా, ఇరు హృదయాల్లో పండువెన్నెలలు కురిశాయి. హద్దులు దాటిన ప్రణయోద్వేగం వారిని పట్టి కుదిపివేసింది.

ఇరువురి రసకేళి నడుమ సమయమెంత గడిచిందో గుర్తురాలేదు.

గడియారం పదకొండు కొట్టడం, హాల్లో ఉన్న ఫోన్ మ్రోగడం ఒకేసారి జరిగాయి.

ఆనందసంద్రంలో మునిగితేలుతున్న ఆ యువదంపతులు..ఒక్కసారిగా విడివడ్డారు.

ఫోన్ లిఫ్ట్ చేయడానికి మంచం దిగిన కుందనను ''వెళ్లకు కుందూ..మ్రోగి మ్రోగి అదే ఆగిపోతుంది'' అన్నాడు కమల్ కోరికతో ఎరుపెక్కిన కళ్లతో ఆమెను కైపుగా చూస్తూ.

''మా బాబు కదూ..ఎవరో చూసి వచ్చేస్తాను'' చెప్పింది కుందన హాల్లోకి వెళ్తూ.

''ఎవరూ..ఆ..నేనే..ఏంటీ..అలాగా..నేను ఒక్క అరగంటలో అక్కడుంటాను. అంతదాకా ఎలాగోలా మ్యానేజ్ చేయండి'' అంది కుందన ఫోన్‌లో మాట్లాడుతూ.

వీటిలో కొన్ని పొడి-పొడి మాటలు తప్ప, మిగిలినవి వినిపించలేదు కమల్‌కి.

ఫోన్ పెట్టేసి గదిలోకి వచ్చిన కుందనను ''ఎవరూ?'' అడిగాడు కమల్.

ఒక్కసారి ఉలిక్కిపడి ''మా ఫ్రెండ్ జమున లెండి. అర్జంట్‌గా నాతో ఏదో మాట్లాడాలట. రమ్మని ఫోన్ చేసింది. మీరు వస్తే నేను టిఫిన్ పెట్టేసి వెళ్లొస్తాను'' అంది కుందన కాస్త తడబాటుగా.

''ఇదన్యాయం కుందూ..రాక రాక నేనొస్తే నా సన్నిధిలో సర్వం మరచి, నన్ను అలరిస్తావని ఆశిస్తే, ఎవరో..జమునో- గిమునో రమ్మంటే వెళ్లిపోతావా! నేనొప్పుకోను'' అన్నాడు కమల్ అలిగినట్లుగా ముఖంపెట్టి.

కుందన అతడి చుబుకం పట్టి తన వైపు తిప్పుకుంటూ ''మా శ్రీవారు బంగారు కొండట, వెండి తండ్రట..ఎంతసేపు! ఇలా వెళ్లి అలా వచ్చేయనూ..'' అంది బతిమాలుతున్నట్లుగా.

''అయితే..ఇంటికొచ్చాక నన్ను విడిచిపెట్టకుండా ఉండాలి. పనులు-పాట్లు అంటూ మధ్యలో వెళ్లకూడదు'' షరతులు విధించాడు కమల్.

''అలాగే మహాశయా..అందాకా ఈ చిరుకానుక సమర్పించెద...స్వీకరించుడు'' అతడి మీదకు వంగి బుగ్గమీద ఒక తియ్యటి ముద్దు బహూకరించింది కుందన.

అంతే..చల్లారిందనుకున్న మోహజ్వాల మళ్లీ ఎగిసింది.

''కుందూ..నన్నిలా హింసించడం తగునా!'' అన్నాడు కుందనను అందుకోబోతూ.

"ప్లీజ్..." అతడిని శతవిధాల ప్రార్థించి పట్టు విడిపించుకుంది కుందన.

టిఫిన్ చేయడం పూర్తయ్యాక చక చక తయారై పోయింది.

అందమైన అవయవాల అమరిక గల సుందర విగ్రహం తల్లిదండ్రుల నుండి సంక్రమిస్తే, మరింత అందంగా కనిపించేటట్లుగా అలంకరించుకునే నైపుణ్యం కుందన స్వంతం.

లైట్ పింక్ కలర్‌లో, ఒంటికి అంటుకుపోయిన టైట్‌ఫిట్ చుడీదార్, అందాలను దాచి ఉంచాలని తాపత్రయ పడుతూ, నిలువలేక జారిపోతున్న పలుచని చున్నీలో.. బంగారు తీగలాంటి కుందన అరవిరిసిన రోజాలా ఉంది.

"మీరు కంగారుపడకండి. సరిగ్గా అరగంటలో వచ్చేస్తాగా" అంది కుందన తన స్కూటీని బయటకు తీస్తూ.

"నేను డ్రాప్ చేయనా" ఆప్యాయంగా అడిగాడు కమల్.

"నో థాంక్స్.. అసలే జర్నీ చేసి అలసిపోయున్నారు. వెళ్లి రెస్ట్ తీసుకోండి" ప్రేమగా చెప్పేసి స్కూటీని ముందుకురికించింది కుందన.

ఆమె కనుమరుగయ్యేవరకు చూసి లోపలికి నడిచాడు కమల్.

★ ★ ★

కమల్, కుందనలకు ఈమధ్యే పెళ్లయ్యింది. డిసెంబర్‌లో పెళ్లవడం వలన ఆషాఢమాసం ఏర్పరచే అవాంతరాలు ఏమీ ఎదురవలేదు వారికి.

కానీ.. వృత్తిరీత్యా మెడికల్ రిప్రజెంటేటివ్ అయిన కమల్‌కి అడపాదడపా క్యాంప్‌లకి వెళ్ళవలసిన అగత్యం ఉంది.

కొత్తకాపురం కొత్తకుండలో నీటిలా తియ్యగా సాగిపోవాల్సిన తరుణంలో, ఈ క్యాంప్‌లకి వెళ్లాల్సి రావడం దుర్భరంగా తోస్తోంది కమల్‌కి.

క్యాంప్ నుండి రావడం ఆలస్యం... కుందనను సందిట్లో అదిమేసి, సందడి చేస్తూ కులకాలన్న తపన అతడిది. అతడికి తగిన తాళం వేస్తూ సహకారమందించే బాధ్యత ఆమెది.

ప్రియపతితో దాంపత్యం మధుర మకరందంలా ఉంటోంది కుందనకు. ఆమె ఇష్టాన్ని కాదనకపోవడం ద్వారా 'మంచి భర్త' అనే బిరుదు పొందాడు కమల్.

అతడు కోరిన సౌఖ్యాలు కొసరి-కొసరి అందిస్తూ 'ఉత్తమ ఇల్లాలు' అన్న ఖ్యాతి గడించింది కుందన.

కుందన సోషియాలజీలో ఎమ్మే చేసింది. పిహెచ్‌డి చేసే ప్రయత్నంలో ఉంది.

విద్యాపరంగా తనని ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించే భర్త అంటే అంతులేని ఆరాధన ఆమెకి.

అన్యోన్యమైన వారి దాంపత్యం అనుక్షణం రసభరితమై 'మూడు చుంబనాలు-ఆరు ఆలింగనాలు'గా వర్ధిలుతోంది.

★ ★ ★

క్యాంప్ నుండి అప్పుడే వచ్చిన కమల్ అన్యమనస్కంగా టి.వి. చూస్తున్నాడు.

అతడు ఇంటికి వచ్చేసరికి ప్రియసతి కుందన దర్శనమివ్వకపోవడమే అందుకు కారణం.

సమయం సరిగ్గా పదకొండు గంటల ఇరవై నిముషాలవుతోంది.

వెళ్లిన పని అనుకున్నదానికన్నా ముందుగా ముగిసిపోవడం వలన, క్యాంపు నుండి ఒకరోజు ముందుగానే ఇంటికొచ్చాడతడు.

హఠాత్తుగా వచ్చేసి అర్ధాంగికి 'సడెన్ సర్‌ప్రైజ్' ఇద్దామని ఆమెకు ఫోన్ కూడా చేయలేదు.

అతడు ఇంట్లో ఉన్న సమయంతా అతడినే వెన్నంటి ఉంటూ కొసరి-కొసరి ముద్దు మురిపాలు తీర్చి వలపుల వాయినాలందించి, శృంగార తీరాల విహరింప జేసే కుందన, ఈమధ్య పదకొండవగానే ఉరుకులు పరుగుల మీద బయటకు వెళ్లిపోతోంది.

ఎందుకని అడిగితే ఏదో ఒక కుంటిసాకు చెప్తోంది. ఆమె నిజమైన కారణం చెప్తోందో లేదో పసిగట్టలేనంత అమాయకుడు కాదు కమల్.

అలాగని అర్ధాంగిని శంకించేంతటి సంకుచిత మనస్కుడు కాదతడు. ఆమెని శంకించడమంటే తనని తాను అవమానించుకోవడమేనన్న నమ్మకం అతడిది.

అతడు ఆలోచనల నడుమ ఉండగానే కుందన వచ్చేసింది. ఆమె వదనం వాడిపోయి అలసిపోయి ఉంది. సెగసోకిన గులాబీలా కమిలిపోయి ఉంది.

"మీరా! ఎంతసేపయింది వచ్చి? రేపు కదా వస్తానన్నదీ" కంగారుగా అంటూ కమల్ దరిచేసింది కుందన.

"ఇప్పుడే ఒక అరగంటైంది. నువ్వేంటి ఈవేళప్పుడు బయటకెళ్లావు. మీ జమునగారికి మళ్లీ ఏదైనా ప్రాబ్లమా?" క్రీగంట చూస్తూ కాస్తంత వ్యంగ్యంగా అడిగాడు కమల్.

అది అర్థమైనట్టు "ఆ..అహా.. ఆ...అంతే" తత్తరపాటు నిండింది కుందన పలుకులలో.

"నాకు..ఆ...కలి.. గా ఉంది" ఒళ్లు విరుచుకున్నాడు కమల్.

"ఇదుగో టెన్ మినిట్స్‌లో వంట రెడీ చేస్తాను" కుందన లేచి నిలబడింది.

"నాకు వేస్తున్నది ఆ ఆకలి కాదు" చేయి పట్టుకు గుంజాడు కమల్.

అతడి చేయి మృదువుగా విడిపించుకొని "ప్లీజ్ కమల్..ఎందుకో కాస్త చిరాగ్గా ఉంది..ఇప్పుడొద్దు" అంది కుందన నిరాసక్తంగా.

"ఏం నాన్నా..ఒంట్లో బాగా లేదా!" ఆదుర్దాగా అడిగాడు కమల్.

అతడి వాక్కులలో జాలువారుతున్న అనురాగ ధారలలో తడిసిన కుందన మది పులకించింది.

"అదేం లేదు కానీ..జస్ట్..ఎందుకో



## రీమేక్‌లో నమిత

దాదాపు పాతికేళ్ల క్రితం వచ్చిన 'జగన్మోహిని' చిత్రం నర్తకి జయమాలిని కెరీర్‌ని హీరోయిన్‌గా కొత్త మలుపు తిప్పింది. ఆ సినిమాని మళ్లీ ఇప్పుడు పునర్నిర్మించే ప్రయత్నాల్లో వున్నట్టు టాలీవుడ్ వార్తలు. ఇందులో జయమాలిని పాత్రని నమిత పోషించే అవకాశాలున్నాయట. మాయలూ మంత్రాలూ అంటే ఈరోజుల్లో (గ్రాఫిక్స్ పేరుతో) బాగానే చూస్తున్న జనాలకి కొత్త 'జగన్మోహిని' నచ్చే అవకాశాలుంటాయనే భావించవచ్చు.

అలా'' అని చెప్పేసి వంట ప్రయత్నాలలో పడింది.

ఆ తరువాత అతడికి అనుగుణంగా కౌగిట్లో కరిగినా అందులో ఏదో యాంత్రికత కనబడుతోంది కమల్‌కి. ఇది వారి సంసార జీవితంలో మొదటిసారి.

'డెఫినెట్‌గా కుందన దేనికో వర్రీ అవుతోంది. అది గ్రహించి ఆమెకు ఓదార్పు నివ్వాలి' అనుకున్నాడు కమల్ తన గుండెల మీద పసిపాపలా నిదురిస్తున్న అర్ధాంగిని చూస్తూ.

★ ★ ★

''నే వెళ్తాలెండి..మీరు లోపలికి వెళ్లండి'' స్కూటీ స్టార్ట్ చేసిన కుందన అంది.

''ఆ..వెళ్లు..నాకూ కాస్త పని ఉంది. చూసుకొని అరగంటలో వచ్చేస్తాను'' చెప్పాడు కమల్ తన బైక్ బయటకు తీస్తూ.

కుందన బయలుదేరగానే ఆమెను అనుసరించాడు. ఆమె తనని గమనించకుండా జాగ్రత్త వహిస్తూ నెమ్మదిగా ఆమె స్కూటీని ఫాలో అయ్యాడు.

మెయిన్‌రోడ్ దాటి ఒక సందులోకి మలుపు తిరిగింది స్కూటీ. కమల్ కూడా డిటో..డిటో..

కుందన కాస్సేపు ప్రయాణించి ఒక బిల్డింగ్ ముందు ఆగింది. స్కూటీ పార్క్ చేసి లోపలికి వెళ్లింది.

కమల్ ఆ బిల్డింగ్‌కి కాస్త దూరంగా ఉన్న ఒక కిళ్లీ బడ్డీ దగ్గర బండి ఆపి, న్యూస్ పేపర్ చాటు చేసుకుని ఆ బిల్డింగ్ వైపే చూడసాగాడు.

అరగంట గడిచాక కుందన బయటకు వచ్చింది.

కుందన కంట పడకుండా ప్రక్కకు తప్పుకున్న కమల్, ఆమె బయలుదేరేవరకూ నిరీక్షించి అప్పుడు ఆ బిల్డింగ్ దగ్గరకు వెళ్లాడు.

బయటున్న బోర్డ్ చూస్తూనే ఉలిక్కిపడ్డాడొక్కసారిగా.

అది...ఎయిడ్స్ బాధితులైన వారిని అక్కున చేర్చుకుని ఆశ్రయమిచ్చే ఒక సేవా సంస్థ.

కుందనకిక్కడేం పని? అతడి భృకుటి ముడివడింది.

అప్పుడు గుర్తొచ్చింది. కుందన 'సమాజంలో మానవ సంబంధాలు-ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి' అన్న దాని మీద రీసెర్చ్ చేస్తోందని.

బహుశా ఆ పనిమీదే కుందన ఇక్కడికి వస్తూ పోతూ ఉండవచ్చు. అలాంటప్పుడు కరెక్ట్‌గా పదకొండు కొట్టగానే రావడం దేనికి?

అనుమాన నివృత్తి చేసుకునేందుకు లోపలికి వెళ్లి అక్కడున్న మేట్రన్‌ని కలిశాడు కమల్.

తనని తాను పరిచయం చేసుకుని కుందన గురించి వాకబు చేశాడు.

మేట్రన్ చెప్పిన విషయాన్ని వింటున్న అతడి హృదయం ఆర్తితో బరువెక్కింది.

కుందనపట్ల ఆరాధన రెట్టింపైంది. ఆమె సత్సంకల్పానికి చేయూత నివ్వాలన్న గట్టి నిర్ణయంతో బయటపడ్డాడు.

★ ★ ★

కుందన మదిలో చెప్పలేనంత గుబులుగా ఉంది. కమల్‌ని మోసం చేస్తోందేమోనన్న గిల్టీఫీలింగ్‌తో ఆమె అణువణువునా ఆవరించి ఉంది.

అసలు సంగతి అతడికి చెప్పేయాలనే ఉంది. కానీ ఒక ఎయిడ్స్ పేషెంట్‌ని చేరదీసి సేవ చేసి వస్తున్నానంటే అతడు ఎలా రియాక్టౌతాడోనని భయపడుతోంది.

ఎయిడ్స్ పేషెంట్స్‌ని ఆదరించి అక్కున చేర్చుకునే స్థాయికి మన సమాజమింకా ఎదగలేదేమోనన్న అభిప్రాయం ఆమెది. కమల్ అందుకు అతీతుడు కాడేమోనన్నది ఆమె అనుమానం.

అందుకే అసలు విషయం వెల్లడించే సాహసం చేయలేకుంది.

రోజుకో సాకు చెప్పి అతడిని మోసం చేయడానికీ మనసు అంగీకరించడం లేదు.

ఏదో అపరాధ భావన మనసుని పట్టి పీడిస్తూండడంతో, అతడిని రంజింప చేయలేకపోతోంది.

ఇవాళ ఎలాగైనా కమల్‌కి సంగతి చెప్పేయాలి. అతడేమంటే అనుకోనీ..

ఇంతలో తలుపు చప్పుడైంది.

'కమల్ వచ్చినట్లున్నాడు' అనుకొని తలుపు తీసింది.

ఆమె ఊహించినట్లుగా కమలే వచ్చాడు. అతడు ఫ్రెష్ అయ్యి వచ్చేసరికి భోజనం వడ్డించింది.

అతడు తినడం ముగించి గదిలోకి వెళ్లిపోయాడు. సీరియస్‌గా ఉన్న అతడి ముఖం చూస్తే భయం వేసింది. మాట్లాడ్డానికే సంకోచం కలిగింది.

''ఏమండీ..'' పిలిచింది నెమ్మదిగా.

ఏదో మ్యాగజైన్ తిరగేస్తున్న కమల్ ఏంటన్నట్లుగా తలెత్తి చూశాడు.

''నేను మీ దగ్గరో సంగతి దాచాను'' తప్పు చేసిన దానిలా తలదించుకుంది కుందన.

''నువ్వేం చెప్పాలనుకున్నావో నాకు తెలుసు. కానీ..అలా నేరం చేసిన దానిలా తలదించుకు చెప్పాలనుకోవడమే నాకు నచ్చలేదు'' కిరణ్ స్వరంలో అభినందన గమనించిన కుందన విభ్రమంగా చూసింది తలపైకెత్తి.

చల్లని వెన్నెల వెదజల్లే చంద్రునిలా హాయిగా నవ్వుతున్నాడు కమల్.

''కమల్..మీకు అంతా తెలిసిపోయిందా?'' ఆత్రంగా ప్రశ్నించింది అతడి సరసన చేరి.

''జస్ట్ ఈవేళే తెలిసింది. రోజూ పదకొండు గంటలకు ఆ హోమ్‌కి వెళ్లి నువ్వేం చేసి వస్తున్నావో తెలుసుకున్నాక నీ మీద గౌరవం రెట్టింపైంది'' చెప్పాడు కమల్ మనస్ఫూర్తిగా.

''అవును కమల్. మొట్టమొదటిసారి రీసెర్చ్ నిమిత్తం అక్కడ పేషెంట్స్‌ని కలుసుకున్న నాకు రమేష్ కనిపించాడు. అమ్మ, నాన్నలు ఎయిడ్స్ వ్యాధితో మరణించారు. తానూ ఆ వ్యాధికి లొంగిపోతున్నాడని తెలియని పసివాడు వాడు. ఏ పాపమూ చేయని అమాయక రమేష్ నాకు చేరువయ్యాడు. నేను తినిపిస్తే గాని అన్నం తినలేని ప్రేమను నాపై పెంచుకున్నాడు. రోజూ వాడికి అన్నం పెట్టేందుకు పదకొండు గంటలప్పుడు నేనక్కడికి వెళ్లేది'' కుందన హృదయం తేలిక పడింది మనసులోని మాట బయటపెట్టాక.

కమల్ తదేకంగా ఆమెనే చూస్తూ ఆమె రెండు చేతులను తీసి కళ్లకద్దుకున్నాడు.

''కమల్!'' సంభ్రమంగా అంది కుందన.

''ప్రాణాంతకమైన వ్యాధితో పోరాడుతున్న ఒక అనాథ బాలునికి, అమ్మలా గోరుముద్దలు తినిపిస్తున్న అమృత హస్తాలివి. నా అందాల కుందన శరీరమే కాదు మనసూ బంగారమేనని తెలుసుకున్నాను'' ఆప్యాయంగా హృదయానికి హత్తుకున్నాడు కమల్.

ఆనందంతో మాటలు రావడం లేదు కుందనకి. నిశ్చింతగా అతడి హృదయం పై సేద తీరింది.

''నా శ్రీమతి 'కుందనపుబొమ్మ' అని మురిసిపోయేవాడిని. ఆ అందానికి వన్నె తెచ్చే అంతఃసౌందర్యం కూడా ఆమె స్వంతం అని తెలుసుకున్నాక మరింతగా గర్విస్తున్నాను. రమేష్‌కి మంచి మందులు ఇప్పిద్దాం. అతడు మరికొన్నాళ్లు ఆనందంగా జీవించేందుకు నా వంతు సహాయం చేస్తానని మాట ఇస్తున్నాను'' కమల్ ఆమె నుదుటి మీద చుంబించాడు.

తన ఆదర్శాలకు చేయూతనిచ్చే భర్త దొరికినందుకు పొంగిపోయింది కుందన.

''సారీ కమల్.. మీ దగ్గర నిజం దాచి పెడుతున్నందుకు గిల్టీగా ఫీలైమీతో సరిగ్గా గడపలేకపోయాను'' నిజాయితీగా చెప్పింది కుందన.

''డోంట్ వర్రీ డియర్..అసలు, వడ్డీ కలిపి ఇప్పుడే వసూలు చేసుకుంటాను'' మళ్లీ పాత కమల్ అయిపోయాడు అతడు.

విస్తుపోయింది కుందన. క్షణం క్రితం ఎంతో గంభీరంగా తనను ప్రశంసించిన కమల్‌కీ చిలిపితనం చిందులేసే కొంటెకృష్ణుడిలాంటి ఈ కమల్‌కీ పోలికే లేదు.

''విత్ ప్లెజర్'' రెండు చేతులూ చాచి అతడిని అల్లుకుపోయింది కుందన.

స్వర్ణప్రతిమలా వెలుగులు విరజిమ్ముతున్న ఆమె తనూలతికకు, తన హస్త ప్రావీణ్యంతో మెరుగులు దిద్దుతున్నాడు అతడు. అతడి చేతుల చిలిపి దాడికి కందిన ఆమె బంగారు వన్నె సొగసులు మరింతగా సోయగాలు కురిపిస్తున్నాయి.

అపార్థాలు తొలగి సత్యాలు ఆవిష్కృతమైన ఆ శుభవేళ-అసలైన శృంగారలీలా విలాసానికి భాష్యం చెప్తూ, రసాంబుధిలో ఓలలాడారు ఆ దంపతులు.

☆